

ధర్మవరంలో చేనేత విగ్రహానికి పూలమాల వేస్తున్న నారా భువనేశ్వరి



ధర్మవరం రూరల్, ఫిబ్రవరి 14: టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరికి జిల్లా జనం నీరాజనాలు పలికారు. నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా నారా భువనేశ్వరి రెండోరోజు బుధవారం జిల్లాలో పర్యటించారు. ధర్మవరం, రాప్తాడు, పెనుకొండ నియోజకవర్గాల్లో పర్యటన సాగింది. నారా భువనేశ్వరికి టీడీపీ శ్రేణులు, అభిమానులు అడుగడుగునా ఘన స్వాగతం పలికారు. మహిళలు ఊరూరా హారతులు పట్టారు. వేలాదిగా తరలివచ్చి, ఆమె కోసం ఎదురుచూశారు. ఆమె రాగానే.. చప్పట్లు, కేరింతలతో స్వాగతం పలికారు. అందరికీ నారా భువనేశ్వరి విజయ సంకేతం చూపుతూ ముందుకు కదిలారు. బత్తలపల్లి మండలం నుంచి ధర్మవరానికి రావడంతో గొట్లూరు గ్రామం నుంచి పుష్పగుచ్ఛాలు అందించి పూలు చల్లుతూ ఘనస్వాగతం పలికారు. అనంతరం పట్టణంలోని కదిరిగేటు వద్ద ఉన్న చేనేత విగ్రహానికి నారా భువనేశ్వరి పూలమాల వేశారు. అక్కడి నుంచి శ్రీరాఘవేంద్రకల్యాణమండపంలో ఏర్పాటుచేసిన చేనేతల ముఖాముఖి సమావేశానికి విచ్చేశారు. ప్రతి ఒక్కరికి చిరునవ్వుతో విక్టరీ గుర్తు చూపిస్తూ అభివాదం చేస్తూ వచ్చారు. అక్కడ పెద్దఎత్తున టీడీపీ నాయకులు, కార్యకర్తలు పుష్పగుచ్ఛాలు అందిస్తూ.. ఆత్మీయంగా పలకరించారు. భారీగా నాయకులు, కార్యకర్తలు తరలిరావడంతో కల్యాణమండపం వద్ద కిక్కిరిసిపోయింది. చేనేత కార్మికులతో గంటకు పైగా ఆత్మీయ సమావేశం నిర్వహించి, వారి స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. చేనేత రంగానికి భరోసా కల్పించడంతో మహిళలు చప్పట్లతో హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ధర్మవరం చేనేతలు, మహిళలు చేనేత రేషన్మాలతో సత్కరించారు. ధర్మవరం పట్టుచీరలను అందించి, అభిమానం చాటుకున్నారు. సమావేశానికి ఊహించనిరీతిలో మహిళలు రావడంతో కల్యాణమండపం కిక్కిరిసింది. చేనేత ముఖాముఖి సమావేశానికి హాజరైన పలువురు మహిళలు తమ కష్టాలను వినతుల రూపంలో నారా భువనేశ్వరికి అందజేశారు. ఆప్యాయంగా వారి అర్జీలను నారా భువనేశ్వరి స్వీకరించి, తగు సాయం చేసి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆమె వెంట మాజీ మంత్రి పరిటాల సునీత, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప, టీడీపీ నేతలు సవిత, బండారు శ్రావణి, పెద్దఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.



ముదిగుబ్బలో పోటెత్తిన అభిమానం

నారా భువనేశ్వరికి దారిపొడవునా

ఘన స్వాగతం

హారతులు పట్టిన మహిళలు

వేలాదిగా తరలివచ్చిన జనం

జన నీరాజనాలు

హిందూపురం: పెనుకొండ సమీపంలో ఏర్పాటైన కియ పరిశ్రమను చూసి నారా భువనేశ్వరి ఆనందపరవశులయ్యారు. నిజం గెలవాలి యాత్రలో భాగంగా అనంతపురం వైపు నుంచి పెనుకొండ వస్తూ బుధవారం సాయంత్రం కియ వద్ద ఆగారు. కియ పరిశ్రమను చూసి, ఆనందం వ్యక్తం చేశారు. టీడీపీ హయాంలో ప్రపంచంలోనే అగ్రశ్రేణి కయ కార్ల పరిశ్రమను పెనుకొండ ప్రాంతానికి తీసుకురావడంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు కృషిని నాయకులతో నారా భువనేశ్వరి గుర్తు చేసుకున్నారు. వైసీపీ పాలనలో కనీసం చెప్పుకోవడానికైనా ఒక్క పరిశ్రమ ఏర్పాటు చేశారా అని టీడీపీ నాయకులతో ఆమె పేర్కొన్నారు.



నారా భువనేశ్వరికి స్వాగతం పలికేందుకు..

బాధిత కుటుంబానికి పరామర్శ

చంద్రబాబు నాయుడు అరెస్టును తట్టుకోలేక మరణించిన పెనుకొండ పట్టణానికి చెందిన టీడీపీ అభిమాని ఆర్‌ఆర్ రహిమాన్ కుటుంబ సభ్యులను నారా భువనేశ్వరి బుధవారం రాత్రి పరామర్శించారు. పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రూ.3 లక్షల చెక్కును సాయంగా అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవిత పాల్గొన్నారు.



కియ పరిశ్రమను చూపుతున్న నారా భువనేశ్వరి



ముళ్ళగురి వెంకటరాముడు కుటుంబీకురాలికి చెక్కు అందజేస్తున్న భువనేశ్వరి



ముదిగుబ్బలో భువనేశ్వరికి స్వాగతం పలుకుతున్న పరిటాల శ్రీరామ్



సంజీవపురంలో టీడీపీ కార్యకర్త చక్కీరయ్య కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం చేస్తున్న నారా భువనేశ్వరి



పెనుకొండలో రహిమాన్ కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న నారా భువనేశ్వరి, చిత్రంలో బీకే పార్థసారథి, సవిత

ఎమ్మెల్యే, ఇన్‌చార్జి మధ్య

కొరవడిన సమన్వయం

- దిక్కుతోచని స్థితిలో వైకేపీ ఉద్యోగులు
- ఆసరా సభల నిర్వహణలో తీవ్ర జాప్యం
- మహిళా సంఘాలకు అందని సొమ్ము



సభా సంకటం!



కదిరి, ఫిబ్రవరి 14: ముఖ్యమంత్రి జగన్ బటన్ నొక్కి మహిళా సంఘాలకు ఆసరా సొమ్ము విడుదల చేసి 20 రోజులు దాటింది. తర్వాత ఆయా నియోజకవర్గాల్లో సైతం సభలు నిర్వహించి ఆసరా సొమ్ము చెక్కులను పంపిణీ చేస్తున్నారు. కదిరి నియోజకవర్గంలో మాత్రం ఆసరా సభల నిర్వహణలో తీవ్ర జాప్యమవుతోంది. వైసీపీ స్థానిక ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మగ్బూల్ బాషా మధ్య సమన్వయం కొరవడడమే ఇందుకు కారణమన్న వాదనలు వినిపిస్తున్నాయి. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వైసీపీ అధిష్టానం పార్టీ నియోజకవర్గాల ఇన్‌చార్జిల మార్పుచేర్పులు చేపట్టింది. అందులో భాగంగా ఎమ్మెల్యే సిద్దారెడ్డిని కాదని, మగ్బూల్ బాషాను నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించింది. ఈ నేపథ్యంలో వీరిరువురి మధ్య విభేదాలున్నాయన్న వాదన ఆ పార్టీ వర్గాల నుంచి వినిపిస్తోంది. ఈ కారణంగా ఆసరా సభల నిర్వహణ డీఆర్‌డీఏ వైకేపీ ఉద్యోగులకు పెనుకష్టంగా మారింది. అధికారికంగా ఎమ్మెల్యే ఆధ్వర్యంలోనే సభ నిర్వహించాలి. వైసీపీ అధిష్టానం మాత్రం నియోజకవర్గ ఇన్‌చార్జి చేతుల మీదుగానే పంపిణీ చేయాలని ఆదేశిస్తోంది. ఎమ్మెల్యే బడ్జెట్ సమావేశాలకు వెళ్లడంతో సరిగా అందుబాటులో లేరు. ఆయన లేకున్నా.. ఇన్‌చార్జి ఆధ్వర్యంలో సభలు నిర్వహిద్దామంటే ఎమ్మెల్యే నుంచి సమస్య వస్తుందేమోనని అధికార వర్గాలు భయపడుతున్నాయి. ఈ నేపథ్యంలో సభలు నిర్వహించాలంటేనే జంకుతున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో 20 రోజులు దాటినా నియోజకవర్గంలో తలుపులలో మాత్రం సభ నిర్వహించారు. అదీ ఎమ్మెల్యే లేకుండా.. ఇన్‌చార్జి ఆధ్వర్యంలో. మిగతా మండలాల్లో ఎప్పుడు నిర్వహిస్తారన్న దానిపై స్పష్టత లేదు. సభలు నిర్వహించేదెన్నడు, తమకు డబ్బు అందజేసేదెన్నడని మహిళా సంఘాల సభ్యులు వాపోతున్నారు. సొమ్ము పంపిణీలో తీవ్ర జాప్యంపై వారు మండిపడుతున్నారు.



ఆలస్యం అందుకే..

ప్రభుత్వం.. మహిళా సంఘాలకు అందిస్తున్న ఆసరా సొమ్ము దాదాపు రూ.20కోట్లు.. 20రోజులైనా అందలేదు. నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న మండలాల్లో ఆసరా సభ జరిగితేనే డబ్బు ఖాతాల్లో జమచేస్తామని వైకేపీ అధికారులు చెబుతున్నారు. ఈ సభలకు ఎమ్మెల్యే సిద్దారెడ్డితో పాటు, ఇన్‌చార్జి మగ్బూల్‌బాషా కూడా హాజరుకావాలని వైకేపీ ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులున్నట్లు సమాచారం. ఎమ్మెల్యే లేకపోయినా, వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మాత్రం కచ్చితంగా హాజరయ్యేలా చూడాలని మౌఖిక ఆదేశాలు జారీ అయినట్లు సమాచారం. ఆ మేరకు వైకేపీ ఆధ్వర్యంలో నిర్వహించే ఆసరా సభకు ఎమ్మెల్యేతోపాటు ఇన్‌చార్జిని కూడా పిలవాల్సి ఉంది. వీరిద్దరి మధ్య సమన్వయం కొరవడడంతోనే ఆసరా సభలు జాప్యమవుతున్నట్లు సమాచారం. దీంతో కొన్నిరోజులుగా ఎమ్మెల్యే బడ్జెట్ సమావేశాలకు హాజరుకావడంతో తేదీలు కుదరక, ఆసరా సభ నిర్వహించలేదని తెలుస్తోంది. అదే సమయంలో ఇన్‌చార్జితోనే సమావేశాలు నిర్వహిద్దాముకుంటే ఎమ్మెల్యేతో సమస్య వస్తుందని వెనకడుగు వేస్తున్నట్లు తెలిసింది. ఈనేపథ్యంలోనే ఆసరా సభలు నిర్వహించడం ఆలస్యమవుతున్నట్లు తెలుస్తోంది.



సమన్వయ లోపం

ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలుకు సాధారణంగా ఎమ్మెల్యేని ఆహ్వానిస్తారు. మూడేళ్లుగా ఇదే కొనసాగింది. మారిన రాజకీయ పరిణామాల దృష్ట్యా నియోజకవర్గ ఇన్‌చార్జిలకు ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రాధాన్యం ఇవ్వాలని మౌఖికంగా ప్రభుత్వ పెద్దలు ఆదేశించినట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యే ఉండగానే ఆయనను పట్టించుకోకుండా ఇన్‌చార్జితో ప్రభుత్వ కార్యక్రమాలు చేయిస్తున్నారు. ప్రభుత్వంతో ఎటువంటి సంబంధంలేని వైసీపీ ఇన్‌చార్జి అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. వారం క్రితం నిర్వహించిన ఆసరా పట్టణ సమావేశంలో ఇన్‌చార్జి మగ్బూల్‌బాషా అన్నీ తానై సభలో వ్యవహరించారు. మహిళా సంఘాల సభ్యులను సమావేశాలకు తరలించి, ఇన్‌చార్జిని పరిచయం చేశారు. ఇది ప్రభుత్వ కార్యక్రమమా, వైసీపీ పరిచయ వేదికా అంటూ ప్రజలు చర్చించుకున్నారు. మహిళా సంఘాలకు డబ్బు కూడా పంపిణీ చేసినట్లు సోషల్ మీడియాలో హల్‌చల్ అయింది. వచ్చే ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి గెలవడానికి ఇటువంటి కుయుక్తులు చేస్తున్నట్లు ప్రజలు చర్చించుకుటున్నారు. ప్రస్తుతం ఎమ్మెల్యే సిద్దారెడ్డితోపాటు, ఇన్‌చార్జి కూడా అందుబాటులో ఉన్నారు. వైకేపీ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ సభలకు ఇద్దరినీ పిలవడానికి సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఇద్దరూ వస్తారా.. రారా అన్నది సందేహమే. ఎమ్మెల్యేని ఆహ్వానిస్తారా.. లేదా అన్నది కూడా అనుమానమే అని ఆయన వర్గీయులు చెబుతున్నారు.

20రోజులైనా అందని ఆసరా

జనవరి 23వ తేదీన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆసరా నాలుగో విడత సొమ్మును బటన్ నొక్కి విడుదల చేశారు. వారంలోపే లబ్ధిదారుల ఖాతాల్లో సొమ్ము జమకావాల్సి ఉంది. 20రోజులవుతున్నా నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన మహిళాసంఘాల సభ్యుల ఖాతాల్లో డబ్బు జమకాలేదు. నియోజకవర్గ వ్యాప్తంగా రూ.20 కోట్ల వరకు ఈ సొమ్ము నిలిచిపోయినట్లు లెక్కలు చెబుతున్నాయి. కదిరిలో రూ.2.11కోట్లు తనకల్లులో రూ.7.20కోట్లు, నల్లచెరువు రూ.4.18 కోట్లు, నంబులపూలకుంటలో రూ.3.61కోట్లు, గాండ్లపెంటలో రూ.1.99కోట్లు సొమ్ము జమకావాల్సి ఉంది. ఇదంతా బ్యాంకులో మూలుగుతోంది. ఎప్పుడు సభలు నిర్వహిస్తారో, ఖాతాల్లో ఎప్పుడు నగదు జమ అవుతోందో అని మహిళలు ఎదురు చూస్తున్నారు. ఎన్నికల వేళ వైసీపీ లబ్ధి పొందడానికి సొమ్ము పంపిణీని ఆపేయడం సరికాదని వారు మండిపడుతున్నారు. సభలతో సంబంధం లేకుండా మహిళా సంఘాలకు సొమ్ము జమ చేయాలని కోరుతున్నారు.



సభ జరిగితేనే సొమ్ము జమ

ఆయా మండలాల్లో ఆసరా సభ నిర్వహిస్తేనే మహిళాసంఘాల సభ్యుల ఖాతాల్లో సొమ్ము జమవుతుంది. లేదంటే లేదు. ఎమ్మెల్యే తేదీలకోసం ప్రయత్నిస్తున్నాం. బడ్జెట్ సమావేశాలకు ఎమ్మెల్యే వెళ్లారు. రాగానే సభ నిర్వహిస్తాం.

-రమణ, ఏరియా కోఆర్డినేటర్, వైకేపీ, కదిరి

కొలువుదీరిన భారీ హనుమయ్య



ఏకశిలా ఆంజనేయస్వామి విగ్రహం

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 14: పట్టణ పరిధిలోని దండురోడ్డులో భారీ హనుమయ్య కొలువుదీరాడు. ఆంజనేయుడి 27 అడుగుల ఏకశిలా విగ్రహాన్ని బుధవారం ప్రతిష్ఠించారు. అంగరంగవైభవంగా కార్యక్రమం నిర్వహించారు. మూడు రోజులుగా వివిధ హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున 4 గంటలకు హనుమంతుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. తెల్లవారు నుంచే భక్తులు పెద్దసంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు. పట్టణం నుంచే కాక దూరప్రాంతాల నుంచి కూడా భక్తులు తరలివచ్చారు. జైశ్రీరామ్ నినాదాలతో ఆలయ ప్రాంగణం మార్మోగిపోయింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పరిపూర్ణానంద స్వామి

పురం ఏకశిల ఆంజనేయ క్షేత్రంగా...

హిందూపురం ఏకశిల ఆంజనేయ క్షేత్రంగా ప్రసిద్ధి చెందుతుందని శ్రీపీఠం పీఠాధిపతి శ్రీ పరిపూర్ణానంద స్వామీజీ పేర్కొన్నారు. దండురోడ్డులో నూతనంగా ప్రతిష్ఠించిన 27 అడుగుల ఏకశిలా విగ్రహాన్ని స్వామీజీ దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. హనుమంతుడు లంకకు వెళ్లి రావణకాష్టం చేసి, రాక్షసులందరినీ మట్టుబెట్టి, సీతమ్మను రామయ్యకు అప్పగించాడన్నారు. అలాగే హిందూపురంలోని అసాంఘిక శక్తులను తరిమికొట్టి 4 ఎకరాల మాన్యంను చేజికించుకున్నారంటే పట్టణవాసులు హనుమంతుడి వారసులని కొనియాడారు. ఏ కార్యమైనా సిద్ధించాలంటే ఆంజనేయస్వామికి మూడు ప్రదక్షిణలు చేసి హనుమాన్ చాలీసాగానీ దండకంగానీ పఠించాలన్నారు. హిందూపురంలోని సూగూరు, దండు రోడ్డులోని భారీ ఆంజనేయుడు కొలువుదీరిన ఆలయాలు మహిమాన్వితమైనవన్నారు.

ప్రభుత్వం మొండివైఖరి



పుట్టపర్తి తహసీల్దార్ కార్యాలయం వద్ద జేఏసీ నాయకుల నిరసన

ఉద్యోగ, పెన్షనర్ల సమస్యల పరిష్కారంలో విఫలం

జేఏసీ నాయకుల మండిపాటు

జిల్లావ్యాప్తంగా నిరసనలు

పుట్టపర్తి, ఫిబ్రవరి 14: తమ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం మొండివైఖరి అవలంబిస్తోందని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల జేఏసీ నాయకులు మండిపడ్డారు. ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా బుధవారం జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసనలు తెలిపారు. నల్లబ్యాడ్జీలు ధరించి, విధులకు హాజరయ్యారు. జిల్లాకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద జేఏసీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జేఏసీ జిల్లా అధ్యక్షుడు లింగా రామ్మోహన్ మాట్లాడుతూ.. ఉద్యోగులకు రావాల్సిన డీఏ, పీఆర్‌సీ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మొండివైఖరి వీడి, న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు చంద్రశేఖర్, షబ్బీర్, నాగార్జున శెట్టి, రామప్ప, వరప్రసాద్, శంకర్‌నారాయణ, లక్ష్మీనారాయణ, రమేష్‌బాబు పాల్గొన్నారు.





రాట్నం తిప్పుతున్న నారా భువనేశ్వరి



ప్రసంగిస్తున్న నారా భువనేశ్వరి



స్వాగతం పలుకుతున్న మహిళలు

ధర్మవరం పట్టుచీర గొప్పతనం తెలుసు



హాజరైన సవిత, పరిటాల జ్ఞాన, శివబాల, చేనేత మహిళలు

● నారా భువనేశ్వరి ● చేనేత మహిళలతో ముఖాముఖి

ధర్మవరం, ఫిబ్రవరి 14: 'ధర్మవరం చేనేత పట్టుచీరకు 125 ఏళ్ల చరిత్ర ఉంది. ఇక్కడ తయారుచేసే రక్షాబంధన్, సంపంగి, పుష్పవల్లి, రంగవల్లి పట్టుచీరల గురించి తెలుసు. ధర్మవరం చేనేత గొప్పతనం తెలియజేయడానికి పద్మవర్షిణి పట్టుచీర ఒక్కటి చాలు' అని తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి పేర్కొన్నారు. ధర్మవరం చేనేతకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు ఉందన్నారు. అంతటి ప్రాశస్త్యం ఉన్న చేనేతకు అండగా నిలిచిన ఏకైక పార్టీ తెలుగుదేశమేనని నారా భువనేశ్వరి పేర్కొన్నారు. బుధవారం ధర్మవరంలోని మారుతీరాఘవేంద్రస్వామి కల్యాణమండపంలో నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ ఆధ్వర్యంలో చేనేత మహిళలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చేనేతలు ఎదుర్కొంటున్న సమస్యలను చేనేత మహిళలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చేనేత మహిళలు చీర తయారీకి అవసరమయ్యే పరికరాలు, ముడిపదార్థాలను భువనేశ్వరికి క్షేత్రస్థాయిలో చూపించారు. వీటి ద్వారా వస్త్రాల తయారీ, మార్కెట్‌కు తరలింపును వివరించారు. ఈ సందర్భంగా నారా భువనేశ్వరి మాట్లాడుతూ.. చేనేత పరిశ్రమ అభివృద్ధికి మొదటి నుంచి కృషిచేస్తున్న పార్టీ టీడీపీ అన్నారు. చంద్రబాబు పాలనలో చేనేతలకు గుర్తింపుకార్డులు ఇచ్చి రూ.50వేల వరకు సబ్సిడీలు అందించి, ఆదుకున్నారన్నారు. నూలుమీద సబ్సిడీని 10 శాతం నుంచి 40 శాతానికి పెంచిన ఘనత చంద్రబాబుదేనన్నారు. చేనేతలకు పనులులేని సమయంలో కార్మిక భృతి ఇచ్చి ఆదుకున్న వ్యక్తి చంద్రబాబు అన్నారు. 50 ఏళ్లు నిండిన చేనేతలకు ప్రతినెలా పెన్షన్ ఇచ్చారన్నారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే చేనేతలకు మరిన్ని సంక్షేమ పథకాలు అందిస్తారన్నారు. గతంలో చేనేతలకు చంద్రబాబునాయుడు అందించిన పథకాలను పునరుద్ధరిస్తారన్నారు. చేనేతలకు ఇప్పటికే చంద్రబాబు కొన్ని హామీలు ఇచ్చారన్నారు. మగ్గం ఉన్న చేనేతలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తారన్నారు. మరమగ్గాల వారికి 500 యూనిట్లు ఉచితంగా ఇవ్వనున్నారన్నారు. ముడిసరుకు కొనుగోలుకు రాయితీలతోపాటు రుణాలను మంజూరు చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. చేనేత వస్త్రాలపై జీఎస్టీ రద్దు చేసేలా చర్యలు తీసుకోవడం, కేంద్రం ఒప్పుకోకపోతే ఆ భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించేలా చర్యలు తీసుకుంటామని చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. చేనేతలు అత్యధికంగా ఉన్న ప్రాంతాల్లో కామన్ వర్కింగ్ షెడ్లను నిర్మిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఆత్మహత్య చేసుకున్న చేనేత కుటుంబాలకు రూ.10లక్షలు పరిహారం అందిస్తారన్నారు. చేనేత పరిశ్రమలో మహిళల భాగస్వామ్యం చాలా అవసరమన్నారు. పేదరికం.. ఆడపిల్లల చదువుకు ఆటంకం కాకూడదనే ఉద్దేశంతో ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా స్త్రీ విద్యకు ప్రాధాన్యతతో 1200 మందికి కుట్టుశిక్షణ ఇచ్చారని ఆమె పేర్కొన్నారు. జిల్లాలో టెక్స్‌టైల్ పార్క్, ఫుడ్‌పార్క్, పార్క్ మోబిస్ ఇండియా, హార్డ్‌వేర్ క్లస్టర్లు, స్మార్ట్‌సిటీ ఏర్పాటు చేసి, ఉపాధి అవకాశాలు కల్పించామన్నారు. నారా లోకేశ్ పాదయాత్రలో మిషన్ రాయలసీమ డిక్లరేషన్ ఇచ్చారన్నారు. అనంతపురం జిల్లాను ఆటో మొబైల్ హబ్‌గా చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇవన్నీ సాధ్యం కావాలంటే రానున్న ఎన్నికల కురుక్షేత్రంలో మహిళలు ఓటు అనే ఆయుధాన్ని దుర్మార్గపు ప్రభుత్వాన్ని గద్దెదించడానికి వాడాలన్నారు.



పరిటాల శ్రీరామ్



ఎమ్మెల్సీ పంచుమర్తి అనూరాధ









చేనేత మహిళలతో ముఖాముఖి ఇలా..

పావని, చేనేత కార్మికురాలు: ధర్మవరం పట్టుచీరకు మంచి డిమాండ్ ఉంది. మీరు బ్రాండ్ అంబాసిడర్‌గా ఉంటూ ప్రమోట్ చేస్తారా?

భువనేశ్వరి: తప్పకుండా చేస్తా. రాష్ట్రవ్యాప్తంగా చేనేతలు తయారుచేసే వస్త్రాలను ప్రమోట్ చేసే బాధ్యత తీసుకుంటా. ధర్మవరం, పోచంపాడు, వెంకటగిరి పట్టుచీరలకు చేతితో నేసిన చీరలనే ప్రమోట్ చేస్తా.

రాధ, చేనేత కార్మికురాలు: ధర్మవరం పట్టుచీర ధరించాలనే కోరిక లేదా?

భువనేశ్వరి: ధర్మవరం పట్టుచీరే కాదు పోచంపాడు, వెంకటగిరి ఇతర ప్రాంతాలకు చెందిన పట్టుచీరలు ధరించాలని కోరిక ఉంటుంది.

సాయిజ్యోతి, కార్మికురాలు: చంద్రబాబునాయుడు సారు.. భర్తగా మీకిష్టమైన పట్టుచీరను ఎప్పుడైనా తీసుకొచ్చారా?

భువనేశ్వరి: చంద్రబాబునాయుడు గారు లేక లేక 30 సంవత్సరాల క్రితం ఒక చీర తీసుకొచ్చారు. అది నాకు ఏ మాత్రం నచ్చలేదు. అయినా నాపై ప్రేమతో తీసుకొచ్చిన చీర అని భద్రంగా దాచుకున్నా. అప్పుడప్పుడు ఆ చీరను చూసుకుని మురిసిపోతుంటా.

రాములమ్మ: మాది చేనేత కుటుంబం. నా భర్త చనిపోవడంతో ఆర్థికంగా చితికిపోయి పిల్లలను చదివించుకోలేని స్థితిలో ఉండేదానిని. మీ అబ్బాయి (నారా లోకేశ్) స్పందించి, మా పిల్లలకు ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా చదివిస్తున్నారు. మీకు రుణపడి ఉంటా.

భువనేశ్వరి: సంతోషమమ్మా. రాష్ట్ర వ్యాప్తంగా పేద పిల్లలను గుర్తించి ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా వేలాది మందికి చదువు అందిస్తున్నాం. వారు బాగా చదువుకుని ఉన్నతస్థాయిలో ఉండటం ఆనందంగా ఉంది.



నారా భువనేశ్వరికి హారతి పడుతున్న మహిళలు



పట్టు చీరల తయారీ గురించి తెలుసుకుంటూ..



నారా భువనేశ్వరికి సత్కారం



మహిళలతో కరచాలనం

చనిపోయిన యువకుడు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్



భువనచంద్ర (ఫైల్)



సాలార్‌బాషా (ఫైల్)

గుత్తిరూరల్, ఫిబ్రవరి 14: మండలంలోని కరిడికొండ గ్రామ శివారులోని 44వ జాతీయ రహదారిపై మంగళవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యువకుడు భువనచంద్ర (26)గా గుర్తించారు. అదే ప్రమాదంలో బుక్కరాయసముద్రం గ్రామానికి చెందిన సాలార్ బాషా (46) మృతిచెందిన విషయం విదితమే. రాప్తాడు మండలం కళాకారుల కాలనీకి చెందిన మల్లికార్జున, శశికళ దంపతుల కుమారుడు భువనచంద్ర హైదరాబాదులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. హైదరాబాదు నుంచి ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి బయల్దేరాడు. కరిడికొండ గ్రామశివారులో బుక్క రాయసముద్రానికి చెందిన సాలార్ బాషా గుజిరీ వ్యాపారం చేస్తూ జీవనం సాగించేవాడు. అక్కడ పెట్రోల్ బంకు వద్ద ఆటో ఆపి రోడ్డు దాడుతుండగా భువనచంద్ర ద్విచక్రవాహనం ఢీకొట్టింది. దీంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. గుత్తి సీఐ వెంకటరామిరెడ్డి ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. సాలార్‌బాషాకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

నలుగురు ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు

కదిరి, ఫిబ్రవరి 14: మండలంలోని కుమ్మరవాండ్లపల్లి ఉన్నత పాఠశాల హెచ్‌ఎంతోపాటు ముగ్గురు ఉపాధ్యాయులకు జిల్లా విద్యాధికారి (డీఈఓ) మీనాక్షి బుధవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. మండల విద్యాధికారి (ఎంఈఓ) చెన్నక్రిష్ణ తెలిపిన వివరాలివి. కుమ్మరవాండ్లపల్లి ఉన్నత పాఠశాలను డీఈఓ బుధవారం తనిఖీ చేశారు. 10వ తరగతి గణిత పాఠ్యాంశాలు ఇంకా పూర్తి చేయకపోవడంతో సంబంధిత ఉపాధ్యాయులు శివశంకర్ రెడ్డి, రవిచంద్రకు, ఉదయం హాజరేసి తిరిగి విధులకు హాజరుకాని పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్ నిర్మలకు, విధి నిర్వహణలో విఫలమయ్యారని ప్రధానోపాధ్యాయుడు రాజగోపాల్‌రెడ్డికి షోకాజ్ నోటీసులు ఇచ్చారన్నారు. బయలాజికల్ ఉపాధ్యాయుడు అనిల్‌కుమార్ నాయక్ మెడికల్ సెలవు పెట్టి, గ్రూప్-1 కోచింగ్ వెళ్లినట్లు తెలియడంతో డీఈఓ ఆగ్రహం వ్యక్తం చేశారు. పదో తరగతి పరీక్షల సమయంలో సెలవు ఎలా ఇచ్చారని ప్రధానోపాధ్యాయుడిని ప్రశ్నించినట్లు సమాచారం.

ఐదు లక్షలిచ్చినా వైసీపీకి ఓటేయను

రాజధాని లేదు.. పరిశ్రమలు లేవు

టెలీ కాలర్‌కు ఓటరు దిమ్మతిరిగే సమాధానం

రాప్తాడు, ఫిబ్రవరి 14: ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి క్యాంపు కార్యాలయం నుంచి వచ్చిన ఓ ఫోన్‌కాల్‌కు ఓటరు దిమ్మతిరిగే సమాధానం ఇచ్చారు. ఏడాదికి రూ.5 లక్షలు ఇచ్చినా ఈసారి వైసీపీకి ఓటు వేసే సమస్యే లేదని తేల్చి చెప్పారు. ఈ కాల్ రికార్డింగ్ ఆడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఆసరా లబ్ధిదారు నాగేంద్రమ్మకు టెలికాలర్ ఫోన్ చేయగా, ఆమె భర్త లిఫ్ట్ చేశారు. 'నాగేంద్రమ్మకు ఆసరా డబ్బు అందుతోందా? ఇతర ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా?' అని మొదట టెలికాలర్ ప్రశ్నించారు. అందుతున్నాయని ఆయన సమాధానం ఇచ్చారు. దీంతో వచ్చే ఎన్నికల్లో రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి ఓటు వేయాలని టెలికాలర్ కోరారు. దీంతో నాగేంద్రమ్మ భర్త సమస్యలను ఏకరవు పెట్టారు. ప్రభుత్వం తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. 'ఎంబీఏ చదివిన నా కొడుకు ఉద్యోగం లేక ఖాళీగా ఉన్నాడు. రాష్ట్రానికి రాజధాని లేదు. పరిశ్రమలు లేవు, ఉద్యోగాలు లేవు. ఉచిత పథకాల ద్వారా తిని కూర్చుని సోమరిపోతులవుతున్నాం. పిల్లల భవిష్యత్తు బాగుండాలంటే రాజధాని, పరిశ్రమలు ఉండాలి. ఉద్యోగాలు కల్పించాలి. పాఠశాలలు అభివృద్ధి చెందాయని పత్రికల ద్వారా ప్రకటనలు ఇస్తున్నారు. బాగుంది. చదువుకున్న వారికి ఉద్యోగాలు లేవు. ప్రభుత్వ ఉద్యోగాలు ఉన్నా నోటిఫికేషన్ వదలడం లేదు. ఉద్యోగాలు కల్పించకుండా ఎన్ని సంక్షేమ పథకాలు ఇచ్చినా ఏం లాభం?' అని నిలదీశారు. 'మా పిల్లల భవిష్యత్తు మాకు చాలా ముఖ్యం. ఈ సారి వైసీపీ వాళ్లు ఎన్ని డబ్బులు ఇచ్చినా ఓటు వేయం..' అని స్పష్టం చేశాడు. ఇంటర్, డిగ్రీ చదివిన వాళ్లు కూడా రూ.5 వేలకు వలంటీర్ ఉద్యోగాలు చేస్తున్నారని, నిరుద్యోగ సమస్య ఉండటంతోనే వేరే దిక్కు లేక వలంటీర్లుగా పనిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పాటై ఉంటే వలంటీర్ ఉద్యోగాలు చేయాల్సిన అవసరం ఉండేది కాదని అన్నారు.

సేవాలాల్ మార్గం అనుసరణీయం

● ట్రస్టు అధ్యక్షుడు జగన్నాథరావు ● ఘనంగా సేవాలాల్ 285వ జయంత్యుత్సవాలు

గుత్తి రూరల్, ఫిబ్రవరి 14: బంజారాల పవిత్రక్షేత్రం సేవాఘడ్ అని, సంత్ సేవాలాల్ మహారాజ్ చూపిన మార్గాన్ని అందరూ అనుసరించాలని సేవాలాల్ మహారాజ్ ట్రస్టు అధ్యక్షుడు జగన్నాథరావు సూచించారు. సేవాఘడ్‌లో సంత్ సేవాలాల్ మహారాజ్ 285వ జయంత్యుత్సవాలను బుధవారం రాత్రి ప్రారంభించారు. రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీ చరణ్, ట్రస్టు ఉపాధ్యక్షుడు కేశవనాయక్, టీటీడీ బోర్డు సభ్యుడు అశ్వత్థనాయక్ జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ.. సేవాఘడ్‌ను పవిత్రక్షేత్రంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నామన్నారు. చరిత్ర ఆధారంగా సేవాలాల్ మహారాజ్ జన్మస్థలాన్ని గుర్తించి సేవాఘడ్‌ను అభివృద్ధి చేస్తున్నామన్నారు. 2000 సంవత్సరం నుంచి ఇక్కడ జయంత్యుత్సవాలను జరుపుకోవడం ఆనందంగా ఉందని వారు పేర్కొన్నారు. రాజస్థాన్ పీఠాధిపతి రమేష్‌జీ మాట్లాడుతూ.. సేవాఘడ్ పవిత్ర క్షేత్రమన్నారు. ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్ మాట్లాడుతూ.. జాతి పురోగతి చెందాలంటే సంప్రదాయ పద్ధతులను ఆదునిక జీవన విధానాన్ని కలగలిసి జీవించాలని బంజారాలకు మార్గోపదేశం చేసిన మహనీయుడు సంత్ సేవాలాల్ మహారాజ్ అన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వెంకటశివుడుయాదవ్ మాట్లడుతూ.. బంజారాల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ మహారాజ్ అన్నారు. ఆయన అడుగుజాడల్లో అందరూ నడవాలన్నారు.

మహారాజ్‌కి, మాతా జగదాంబకి ప్రత్యేక పూజలు

సేవాఘడ్‌లో స్వామివారికి బుధవారం వేకువజామున పంచామృతాభిషేకం, వివిధ పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాతాజగదాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి ఉత్సవమూర్తులను సాయంత్రం పల్లకిలో కొలువుదీర్చి మేళతాళాలతో ఊరేగించారు. రాత్రి వివిధ రాష్ట్రాల నుంచి బంజారాలు పెద్దతున తరలివచ్చారు. గురువారం మాతాజగదాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి 101 మంది యువతులతో బోనాలు సమర్పిస్తారు. అత్యంత కీలకమైన మహాబోగ్ కార్యక్రమతో ఉత్సవాలు ముగుస్తాయి. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు రవీంద్ర నాయక్, వెంకటరమణ నాయక్, యస్‌కే రామచంద్ర నాయక్, సీఐలు వెంకట్రామిరెడ్డి, రాజశేఖర్ రెడ్డి, ఎస్ఐ నబిరసూల్ ఎంపీడీఓ శ్రీనివాసులు, ఈఓఆర్‌డీ శివాజీ రెడ్డి పాల్గొన్నారు.





అలంకరణలో సేవాలాల్ మహారాజ్, జగదాంబ అమ్మవారు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ట్రస్టు అధ్యక్షుడు, సభ్యులు



హాజరైన బంజారాలు

సీఎం సిద్ధం సభను అడ్డుకుంటాం: ఏఐవైఎఫ్



మాట్లాడుతున్న విద్యార్థి సంఘం నాయకులు

రాయదుర్గం, ఫిబ్రవరి 14: వైసీపీ ఆధ్వర్యంలో ఈ నెల 18న రాప్తాడులో నిర్వహించనున్న సిద్ధం సభను అడ్డుకోవడానికి సిద్ధంగా ఉన్నామని ఏఐవైఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కొట్రేష్ తెలిపారు. పట్టణంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో 25 వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని, టెట్, డీఎస్సీల నోటిఫికేషన్, పరీక్షకు 30 రోజుల సమయాన్నే కేటాయించడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. దీన్ని 90 రోజులకు పెంచాలన్నారు. డీఎస్సీకి దరఖాస్తు చేసుకోవడానికి అన్ని కేటగిరీలకు రూ.750లు ఫీజు నిర్ణయించడాన్ని వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. హామీలు అమలు చేయమని అడిగితే విద్యార్థి సంఘం నాయకులను నిర్బంధించడం, అరెస్టు చేయడం తప్ప ఈ ప్రభుత్వం యువతీయువకులకు ఉద్యోగాలు ఇవ్వడంలో పూర్తిగా విఫలమైందన్నారు. అందుకే రాప్తాడులో జరిగే సిద్ధం సభను అడ్డుకోవడానికి ఏఐవైఎఫ్, ఆంధ్రప్రదేశ్ నిరుద్యోగుల జేఏసీగా తాము సంసిద్ధంగా ఉన్నామని తెలిపారు. కార్యక్రమంలో తాలూకా కార్యవర్గ సభ్యుడు యోగేంద్ర, నాయకులు దినకర్, తేజ, మాధవ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఆడపడుచుల రుణం తీర్చుకోలేనిది: నారా భువనేశ్వరి

బత్తలపల్లి, ఫిబ్రవరి 14: ఇళ్లు వదిలి ఏనాడూ బయటకు రాని ఆడపడుచులు చంద్రబాబును అక్రమ కేసుల్లో అరెస్టు చేసినప్పుడు రోడ్డు మీదకు వచ్చి న్యాయం కోసం పోరాటాలు చేశారని, వారి రుణం తీర్చుకోలేనిదని నారా చంద్రబాబు నాయుడి సతీమణి నారా భువనేశ్వరి పేర్కొన్నారు. నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆమె బత్తలపల్లి మండలంలో పర్యటించారు. మండలకేంద్రానికి చేరుకోగానే టీడీపీ శ్రేణులు, స్థానికులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. ఆమె అందరికీ అభివాదం చేస్తూ.. ముందుకు కదిలారు. అనంతరం మండలంలోని సంజీవపురం గ్రామానికి చేరుకుని అక్కడ చంద్రబాబు అరెస్టును తట్టుకోలేక మరణించిన వెంకటరాముడు, చక్రయ్య ఇళ్లకు వెళ్లారు. తొలుత మృతుల చిత్రపటాలకు నివాళులర్పించారు. తర్వాత వారి కుటుంబసభ్యులను పరామర్శించి... అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అలాగే ఒక్కో కుటుంబానికి రూ.3లక్షల చెక్కును అందించారు. అనంతరం గ్రామంలోని నాగల కట్ట వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఇళ్లు వదలి బయటకు రాని ఎందరో ఆడపడుచులు వైసీపీ ప్రభుత్వం చంద్రబాబును అక్రమకేసుల్లో అరెస్టు చేసి జైల్లో పెట్టిన సమయంలో.. ఆయనకు మద్దతుగా ఏకంగా రోడ్ల మీదకు వచ్చి పోరాడారని తెలిపారు. వారి రుణం ఎప్పటికీ తీర్చుకోలేమన్నారు. మీరంతా ఉన్నారన్న ధైర్యంతోనే ఈరోజు నేను ఇలా తిరుగుతున్నానని తెలిపారు. రాష్ట్రం బాగుండాలంటే వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ మంత్రి పరిటాల సునిత, ఎమ్మెల్సీ అనూరాధ, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరాం, నాయకులు బండారుశ్రావణి, విజయ్‌కుమార్, చల్లాశ్రీనివాసులు, నారాయణరెడ్డి, జగ్గు, సతీష్, సాంబ, తదితరులు పాల్గొన్నారు.


సంజీవపురంలో నారా భువనేశ్వరితో కరచాలనానికి ఎగబడుతున్న మహిళలు

ముదిగుబ్బలో ఘనస్వాగతం


ముదిగుబ్బలో ప్రజలకు అభివాదం చేస్తున్న నారా భువనేశ్వరి


స్వాగతం పలకడానికి వేచివున్న మహిళలు

ముదిగుబ్బ, ఫిబ్రవరి14: నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా నారా చంద్రబాబు నాయుడి సతీమణి భువనేశ్వరి కదిరి నుంచి బత్తలపల్లి మండలం సంజీవపురం గ్రామానికి వెళుతుండగా.. మార్గంమధ్యలోని ముదిగుబ్బలో ఘన స్వాగతం లభించింది. భువనేశ్వరి వస్తున్నారన్న సమాచారం తెలియడంతో మండలవ్యాప్తంగా టీడీపీ శ్రేణులు మండలకేంద్రానికి చేరుకున్నారు. బస్టాండ్ కూడలిలోకి ఆమె రాగానే పూలమాలలు, బొకేలతో ఘన స్వాగతం పలికారు. మహిళలు హారతులు పట్టారు. భువనేశ్వరి అందరికీ అభివాదం చేశారు. స్థానిక ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్‌తో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. పెద్దఎత్తున నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావడంతో బస్టాండు కూడలి కిక్కిరిసింది.

కుణుతూరులో..

ధర్మవరంరూరల్: నిజం గెలవాలి అనే కార్యక్రమంలో భాగంగా నారాచంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి ధర్మవరం విచ్చేశారు. ఈ సందర్భంగా ధర్మవరంలో చేనేతలతో ముఖాముఖి సమావేశం అనంతరం కుణుతూరు గ్రామం మీదుగా కనగానపల్లి మండలానికి వెళ్లారు. ఈ సందర్భంగా కుణుతూరు గ్రామంలో మాజీ ఎంపీపీ, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు కుణుతూరు వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు ఆమెకు ఘనస్వాగతం పలికారు. నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున బొకేలు అందించి తమ అభిమానాన్ని చాటుకున్నారు.

విద్యార్థులు లక్ష్యంతో చదవాలి

కదిరి, ఫిబ్రవరి 14: విద్యార్థులు లక్ష్యం పెట్టుకుని చదవాలని, అప్పుడే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని నారా భువనేశ్వరి సూచించారు. పట్టణంలోని హరీష్ పాఠశాలలో బుధవారం ఆమె.. విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. తొలుత పాఠశాలలో ఉన్న సరస్వతీ ఆలయాన్ని సందర్శించి పూజలు చేశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకోవాలన్నారు. లక్ష్యం చేరడానికి కష్టపడి చదవాలన్నారు. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని తెలిపారు. పాఠశాల విద్యార్థినులు గాయత్రి శ్లోకాన్ని వినిపించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ కిరణ్‌కుమార్, టీడీపీ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


హరీష్ పాఠశాలలోని సరస్వతి ఆలయంలో పూజలు చేస్తున్న నారా భువనేశ్వరి

చేనేత సమావేశానికి భారీగా తరలిన మహిళలు

ధర్మవరం: నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా బుధవారం ధర్మవరం పట్టణంలో పర్యటించిన చంద్రబాబు సతీమణి భువనేశ్వరి స్థానిక మారుతీరాఘవేంద్ర స్వామి కల్యాణ మండపంలో చేనేత మహిళల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహిళలు పెద్దఎత్తున తరలివెళ్లారు. ముఖ్యంగా 25వ వార్డుకు చెందిన మహిళలు టీడీపీ ఇన్‌చార్జి భీమనేని ప్రసాద్‌నాయుడు ఆధ్వర్యంలో భారీగా తరలివెళ్లారు.

దామోదరం సంజీవయ్యకు ఘన నివాళి

పుట్టపర్తి, ఫిబ్రవరి 14 : ఆంధ్ర ప్రదేశ్ తొలి దళిత ముఖ్యమంత్రిగా పని చేసిన దామోదరం సంజీవయ్య జయంతి వేడుకలను జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంజీవయ్య చిత్రపటానికి కలెక్టర్ అరుణ్‌బాబు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ సాధారణ దళిత కుటుంబంలో జన్మించిన దామోదరం సంజీవయ్య కష్టపడి చదివి కలెక్టర్ స్థాయికి ఎదిగారన్నారు. ఆ తరువాత ఆంధ్రప్రదేశ్ రెండో ముఖ్యమంత్రిగా సేవలందించారన్నారు. రాష్ట్రానికి తొలి దళిత ముఖ్యమంత్రి ఆయనేనని పేర్కొన్నారు. వృద్ధాప్య పింఛన్ పథకం రూపకర్త దామోదరం సంజీవయ్యనేనని కొనియాడారు. ఆయన జీవితం ఎందరికో స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో డీఆర్వో కొండయ్య, సాంఘిక సంక్షేమశాఖాధికారి శివరంగప్రసాద్, ఎస్సీ విజిలెన్స్ కమిటీ సభ్యుడు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.


దామోదరం సంజీవయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

టీడీపీతోనే సామాజిక న్యాయం: పల్లె


టీడీపీలోకి చేరిన వారితో పల్లె తదితరులు

పుట్టపర్తి, ఫిబ్రవరి 14 : తెలుగుదేశం పార్టీతోనే సామాజిక న్యాయం జరుగుతుందని మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి పేర్కొన్నారు. కొత్తచెరువు మండలం మైలేపల్లికి చెందిన 30 కుటుంబాల వారు బుధవారం వైసీపీని వీడి టీడీపీలోకి చేరారు. వారిని జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పల్లె రఘు నాథరెడ్డి కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసీపీ విధానాలతో విసిగిపోయిన అనేక మంది ఆ పార్టీ శ్రేణులు టీడీపీలో వలస వస్తున్నట్లు తెలిపారు. టీడీపీలో కష్ట పడి పని చేసిన వారికి తగిన గుర్తింపు ఉంటుందని చెప్పారు. అలాగే ఈ పార్టీలో అన్ని వర్గాల వారికి సమన్యాయం లభిస్తుందని అన్నారు. టీడీపీలోకి చేరిన వారిలో వెంకటేశు, శ్రీనివాసులు, వెంకటరాముడు, శివ, నారాయణస్వామి, అనూష కృష్ణవేణి, సాయి తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో నాయకులు సాలక్కగారి శ్రీనివాసులు, ఒలిపి శ్రీనివాసులు, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు అక్షరాభ్యాసం

నంబులపూలకుంట, ఫిబ్రవరి 14: మండలకేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అక్షరాభ్యాస్యాన్ని బుధవారం చేపట్టారు. వసంత పంచమి సందర్భంగా మూడేళ్ల వయసున్న చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. తొలుత చదువుల తల్లి సరస్వతీదేవి చిత్రపటానికి పూలమాలలు వేసి, పూజలు చేశారు. అనంతరం చిన్నారులతో అక్షరాలు దిద్దించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నరసమ్మ, కార్యకర్త శోభ చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.


ఎన్‌పీకుంట అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న దృశ్యం

ధర్మవరం: పట్టణంలోని సూర్యస్కూల్లో బుధవారం వసంత పంచమి సందర్భంగా అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని వేదపండితులు నిర్వహించారు. తొలుత పాఠశాలలో ఏర్పాటు చేసిన సరస్వతి దేవి చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పలువురు చిన్నారుల చేత అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నరేంద్ర బాబు, ఉపాధ్యాయులు , విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నల్లమాడ: మండలంలోని కుటాలపల్లి ఎంపీయూపీ పాఠశాలలో వసంత పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు రమావత్ చాప్లా నాయక్ విద్యార్థుల చేత సరస్వతీ చిత్రపటానికి పూజలు చేయించారు. అనంతరం సరస్వతి, గాయత్రి శ్లోకాలు చెప్పించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

ధర్మవరం, ఫిబ్రవరి 14: పట్టణంలోని కాలేజీ సర్కిల్ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని కేతిరెడ్డి కాలనీకి చెందిన శ్రీనివాసమూర్తి బైక్‌లో పట్టణంలోకి బయలుదేరాడు. కాలేజీ సర్కిల్ వద్దకు రాగానే ఆర్టీసీ బస్టాండ్ వైపు నుంచి ఎదురుగా వస్తున్న ఐషర్ వాహనం ఢీకొంది. ప్రమాదంలో శ్రీనివాసమూర్తి తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే అతడిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం.. మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

చిల్లర దుకాణంలో చోరీ

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 14: మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్దగల చిల్లర దుకాణంలో చోరీ జరిగింది. బాధితుడు నరసింహులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. రోజూలాగే తాను బుధవారం ఉదయం వచ్చి దుకాణం తెరవడానికి ప్రయత్నించానని, అయితే అప్పటికే స్క్రూలు తొలగించి తలుపు ఓపెన్‌లో ఉందని తెలిపారు. లోపలికి వెళ్లి చూడగా అందులోకి వస్తువులు చిందరవందగా కిందపడి ఉన్నాయన్నారు. గుర్తుతెలియని వ్యక్తులు దుకాణం తలుపు తొలగించి లోపలికి చొరబడ్డారని, తర్వాత అందులోని వస్తువులను చోరీ చేశారని వాపోయారు. సుమారు రూ.50వేల విలువ చేస్తే వస్తువులు, రూ. నాలుగువేల నగదు చోరీ జరిగినట్లు చెప్పారు. విషయాన్ని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

వైసీపీ నాయకుడి దౌర్జన్యం

● బీడిపల్లిలో పునాది కూల్చివేత

పుట్టపర్తి, ఫిబ్రవరి 14: జిల్లా కేంద్రంలోని బీడిపల్లిలో వైసీపీ నాయకులు చెలరేగిపోయి ఓ మహిళ నిర్మించుకున్న పునాదిని కూల్చేశారు. బాధితురాలు శ్యామలమ్మ తెలిపిన వివరాల మేరకు .. ఆమెకు బీడిపల్లిలోని సర్వే నంబరు 89లో రెండు సెంట్ల స్థలానికి పట్టా ఇచ్చారు. అందులో షెడ్డు వేసుకునేందుకు ఆమె పునాది నిర్మించింది. అయితే ఈ స్థలం నాదేనంటూ అదే గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు రంగప్ప దౌర్జన్యం చేశాడు. ఈ క్రమంలో బుధవారం జేసీబీతో ఆ పునాదిని కూల్చివేయించాడు. అనంతరం నీకు ఇష్టమొచ్చిన వారితో చెప్పుకోమంటూ మహిళను సైతం బెదిరించాడు. దీంతో ఆమె అర్బన్ సీఐ కొండారెడ్డికి ఫిర్యాదు చేశారు. దీనిపై సీఐ స్పందిస్తూ.. విషయాన్ని రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళతామని, అసలైన హక్కుదారులు ఎవరో తేలిన తర్వాత న్యాయం చేస్తామని తెలిపారు.

24లోగా సమస్యలు పరిష్కరించాలి

● లేకపోతే పోరాటాలు చేస్తాం ● పారిశుధ్య కార్మికుల హెచ్చరిక

ధర్మవరం, ఫిబ్రవరి 14: సమ్మె కాలంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం ఈనెల 24వ తేదీలోగా పరిష్కరించాలని, లేకపోతే పోరాటాలు చేస్తామని పట్టణంలోని మున్సిపల్ కార్మికులు హెచ్చరించారు. సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ బుధవారం వారు స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. వారికి సీఐటీయూ నాయకులు మద్దతు పలికారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల ప్రధానకార్యదర్శి అయూబ్‌ఖాన్, పారిశుధ్యకార్మికసంఘం అధ్యక్ష, కార్యదర్శులు బాబు, ముకుంద మాట్లాడారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఇటీవల 16 రోజులు సమ్మె చేశామన్నారు. ముఖ్యంగా వేతనం రూ.21వేలు ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఎక్స్‌గ్రేషియా, సంక్షేమపథకాల వర్తింపు, పర్మనెంట్ కార్మికులకు సరెండర్ లీవులు, పాఠశాలల ఆయాలకు బకాయిల చెల్లింపులు, క్లాప్ డ్రైవర్లకు రూ.18500ల జీతం చెల్లింపులు చేపట్టాలని కోరుతూ సమ్మె చేపట్టామన్నారు. అయితే ప్రభుత్వం ఆ దిశగా ఇంతవరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. ఈనెల 24లోగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకపోతే పోరాటాలు చేస్తామని తెలిపారు. అనంతరం ఈ మేరకు కమిషనర్ రాంకుమార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో పలువురు కార్మికులు పాల్గొన్నారు.


మున్సిపల్ కార్యాలయం ఎదుటనిరసన చేస్తున్న పారిశుధ్యకార్మికులు, సీఐటీయూ నాయకులు

హామీలకు జీవోలు విడుదల చేయాలి

కదిరి అర్బన్: మున్సిపల్ కార్మికులకు సమ్మె సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలకు జీవోలు విడుదల చేయాలని పట్టణంలోని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, గతనెలలో 16రోజులపాటు సమ్మె నిర్వహించామన్నారు. సమస్యలు పరిష్కరిస్తామని ప్రభుత్వం అప్పుడు హామీ ఇచ్చిందన్నారు. అయితే ఇంతవరకు జీవోలు ఇవ్వలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఇచ్చిన హామీలకు జీవోలు విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు తిరుపాల్, బాలక్రిష్ణ, జనార్ధన్, నరసింహమూర్తి, రాజు, చెన్నక్రిష్ణ, క్రిష్ణకుమార్, సీఐటీయూ నాయకులు జగన్మోహన్, రామమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

● జేఏసీ డిమాండ్



కదిరిలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద జేఏసీ ఆందోళన


బుక్కపట్నంలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న పీహెచ్‌సీ సిబ్బంది

కదిరిఅర్బన్, ఫిబ్రవరి 14: రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం ఉద్యోగ జేఏసీ పిలుపు మేరకు పట్టణంలోని నాయకులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. జేఏసీ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లకు ఐఆర్ 30శాతం ప్రకటించాలని, పెడింగ్‌లో ఉన్న ఆర్థిక బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలన్నారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ విధానం రద్దు చేయాలన్నారు. సీపీఎస్‌రద్దు చేసి.. పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. పెన్షనర్లకు 1వతేదీనే జీతలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. యూటీఎఫ్, పెన్షనర్ల సంఘం, ఎన్జీఓ నాయకులు శ్రీనివాసులు, ఆత్మారెడ్డి, శివారెడి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

బుక్కపట్నం: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఉద్యోగ జేఏసీ నాయకులు తెలిపారు. రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఉద్యోగులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందన్నారు. ఉద్యోగులకు రావలసిన బకాయిలు చెల్లించకుండా కాలయాపన చేస్తోందన్నారు. రాబోయే రోజులు తమకు రావలసిన బకాయిలు చెల్లించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు లింగా, రామమోహన్, డాక్టర్ సునీల్, మురళి తదితరులు పాల్గొన్నారు.

కందికుంట యశోదమ్మ ఆర్థికసాయం

నంబులపూలకుంట, ఫిబ్రవరి 14: మండలంలోని వడ్డిపల్లి గ్రామానికి చెందిన టీడీపీ బూత్ కన్వీనర్ వల్లెపు శ్రీనివాసులు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. ఆయన కుటుంబానికి పార్టీ కదిరి నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్ సతీమణి కందికుంట యశోదమ్మ బుధవారం ఆర్థికసాయం అందించారు. కదిరి పట్టణంలోని తమ స్వగృహంలో ఆమె మృతుడి భార్య రమణమ్మకు రూ. మూడు లక్షల ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా యశోదమ్మ మాట్లాడుతూ మృతుడి కుటుంబాన్ని ఆదుకుంటామన్న హామీ మేరకు ఈ సాయం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు విజయ్ కుమార్ యాదవ్, రఘునాథ్‌రెడ్డి, వేణుగోపాల్ యాదవ్, గంగిరెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.


మృతుడి కుటుంబంతో కందికుంట యశోదమ్మ తదితరులు

రామాలయ నిర్మాణానికి భూమిపూజ

కదిరిఅర్బన్, ఫిబ్రవరి 14: మండలంలోని అబ్బావాండ్లపల్లిలో సీతారాముల ఆలయ నిర్మాణానికి బుధవారం గ్రామస్థులు భూమిపూజ నిర్వహించారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై పూజలో పాల్గొన్నారు. తొలుత ఆయనకు గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. కందికుంట వెంట నాయకులు పవన్‌కుమారెడ్డి, గంగులప్ప, ముస్తఫా, అంజి తదితరులు ఉన్నారు.


భూమిపూజలో పాల్గొన్న కందికుంట

రేపు సమ్మెకు తరలిరండి

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 14: భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై పోరాడేందుకు ఈనెల 16వతేదీన సమ్మె నిర్వహించనున్నట్లు సీఐటీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు కుళ్లాయప్ప, శ్రీరాములు తెలిపారు. మండలకేంద్రంలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. స్థానిక వెంకటసాయి ఐటీఐలో శుక్రవారం ఉదయం 9గంటలకు తొలుత భవన నిర్మాణ కార్మికుల సమావేశం ఉంటుందన్నారు. తర్వాత అక్కడ నుంచి ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయం వరకు వెళ్లి సమ్మె చేపట్టనున్నట్లు చెప్పారు. కార్మికులు సమ్మెను విజయవంతం చేయాలని కోరారు.

ఉపాధ్యాయుడికి తీవ్ర అస్వస్థత

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 14: విద్యార్థులకు విద్యాబోధన చేస్తుండగా ఓ ఉపాధ్యాయుడు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. మండలంలోని కమ్మవారిపల్లి ప్రభుత్వ యూపీ పాఠశాలలో ఎంటీఎస్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న నేలకోటప్ప బుధవారం విద్యార్థులకు పాఠాలు చెబుతూ తీవ్ర అస్వస్థతకు గురై ఉన్నట్టుండి కింద పడ్డాడు. వెంటనే పాఠశాల హెచ్‌ఎం సుధాకర్‌నాయక్, తోటి ఉపాధ్యాయులు అతడిని కొండకమర్ల ఆర్ఎంపీ వైద్యుడి వద్ద ప్రథమ చికిత్సచేయించారు. అనంతరం 108లో కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎంఈఓ రమణ ఆస్పత్రికి వెళ్లి ఉపాధ్యాయుడి ఆరోగ్య స్థితిని వైద్యులనడిగి తెలుసుకున్నారు. వైద్యుల సలహా మేరకు మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. ఉపాధ్యాయుడు నిరుపేద కావడంతో తోటి ఉపాధ్యాయులు పోగు చేసిన రూ.30వేల మొత్తాన్ని కుటుంబసభ్యులకు అందించారు.

గంధపు చెక్కల స్వాధీనం

కదిరి, ఫిబ్రవరి 14: మున్సిపాలిటీ పరిధిలోని బోయరామన్నగారిపల్లిలో ఉండే మల్లేశ్వరి అనే మహిళ నుంచి 22.5 కేజీలు గంధపు చెక్కలను బుధవారం స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ ఎస్ఐ బాబ్‌జాన్ తెలిపారు. బోయరామన్నగారిపల్లిలో మహేశ్వరి ఇంట్లో గంధపు చెక్కలున్నట్లు సమాచారం వచ్చిందని, వెంటనే సిబ్బందితో వెళ్లి సోదా చేయగా.. గంధపు చెక్కలు లభ్యమయ్యాయని చెప్పారు. వాటిని స్వాధీనం చేసుకున్నామన్నారు. వాటి బరువు 22.5 కేజీలున్నట్లు పేర్కొన్నారు. ఈచెక్కలను బెంగళూరుకు చెందిన అలాఫ్ అనే వ్యక్తి ఇచ్చినట్లు మల్లేశ్వరి తెలిపిందని చెప్పారు. ఆ ఇద్దరిపై అటవీ శాఖ యాక్టు ప్రకారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు వివరించారు. అల్తాఫ్ పరారీలో ఉన్నాడు.

బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

బుక్కపట్నం, ఫిబ్రవరి 14: గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ సురేష్‌బాబు తెలిపారు. మండలంలోని జానకంపల్లి క్రాస్ వద్ద బుధవారం వాహనాల తనిఖీ చేస్తుండగా ద్విచక్రవాహనంలో అక్రమంగా తరలుతున్న 20 ఆంధ్ర మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. పుట్టపర్తి మండలం యనుమలపల్లికి చెందిన ఈడిగ ప్రసాద్ మద్యంను అక్రమంగా తరలిస్తుంటే పట్టుకున్నామన్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. ఏఎస్ఐ రంగనాయక్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

11 జంటలకు ఉచిత వివాహాలు

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 14: మండలంలోని ఎం. కొత్తపల్లి బండపై వెలసిన అయ్యస్వామి ఆలయ ఆవరణలో గల లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో బుధవారం కదిరి జోగి శ్రీదేవి ఫౌండేషన్ చైర్మన్ కోడూరు శ్రీకాంత్, ఆలయ సంకల్పకులు పచ్చర్ల ఆంజనేయులనాయుడు ఆధ్వర్యంలో ఉచిత వివాహాలు జరిగాయి. ఈసందర్భంగా ఆలయ సంకల్పకులు మాట్లాడుతూ.. 11 జంటలకు సామూహికంగా ఉచిత వివాహాలు చే శామన్నారు. అమడగూరు, ఓడీసీ మండలాలకు చెందిన వధూవరులకు జోగి శ్రీదేవి ఫౌండేషన్ వారు నూతన వస్త్రాలు, మంగళ సూత్రం, పెళ్లి సామగ్రి అందించగా.. పురోహితులు పంచరత్న సురేష్ శర్మ కల్యాణం నిర్వహించారన్నారు. కార్యక్రమంలో ఆలయ సేవకులు, వధూవరుల బంధువులు పాల్గొన్నారు.

తండ్రిపై కత్తితో దాడి

కదిరి, ఫిబ్రవరి 14 : మున్సిపాలిటీ పరిధిలోని బేరిపల్లికి చెందిన నజీర్ బాషాపై ఆయన కొడుకు ఇమ్రాన్ బుధవారం కత్తితో దాడి చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు వివరాలిలా ఉన్నాయి. నజీర్‌బాషా, ఆయన కుమారుడు ఇమ్రాన్ బేల్దారి పని చేసుకుని జీవనం సాగిస్తున్నారు. అయితే బుధవారం కుటుంబ సమస్యలపై తండ్రి, కొడుకు వాగ్వాదం చేసుకున్నారు. ఈ క్రమంలో మద్యం మత్తులో ఉన్న ఇమ్రాన్ కత్తి తీసుకుని తండ్రిపై దాడి చేసి గాయపరిచాడు. దీంతో అతను అక్కడే కుప్పకూలిపోయాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వ్యాసరచన పోటీలు

తాడిమర్రి, ఫిబ్రవరి 14: రోడ్డు భద్రతా వారోత్సవాలను పురస్కరించుకుని మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బుధవారం ఎంపీఐ వరప్రసాద్ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అర్చన, ప్రసన్న, దుర్గేశ్వరి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందుకున్నారు. కార్యక్రమంలో ఎంఈఓ కృష్ణమోహన్ పాల్గొన్నారు.

ముదిగుబ్బలో రథయాత్ర

ముదిగుబ్బ, ఫిబ్రవరి14: కదిరి పట్టణంలో ఈనెల 21న జరగనున్న అయోధ్యసీతారాముల కల్యాణ మహోత్సవానికి సంబంధించి ప్రచారం చేస్తున్న రథయాత్ర మండలకేంద్రంలో గురవారం సాగింది. ఈ ప్రచార రథానికి స్థానిక భక్తులు ఘన స్వాగతం పలికి జైశ్రీరామ్ అంటూ నినాదాలు చేశారు. మండలకేంద్రంలోని ప్రధాన వీధుల్లో ప్రచార రథయాత్ర కొనసాగింది. అనంతరం మండలంలోని వలిమిచెర్లోపల్లి, గాండ్లవారిపల్లి, బీడిమర్రి, గంగిరెడ్డిపల్లి, మర్తాడు, ఇందుకూరు, దొరిగల్లు గ్రామాలకు చేరుకుంది. కార్యక్రమంలో బీజేపీ అగ్రికల్చర్ రాష్ట్ర రీసెర్చ్ కోకన్వీనర్ సోమలప్రకాష్ ఆధ్వర్యంలో ఆర్ఎస్ఎస్ సేవా ప్రముఖ్ అంబటి ప్రకాష్, ఎస్ఎస్ఎఫ్ వెంకట్, జాతీయ మానవహక్కుల కౌన్సిల్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వెంగమేష్‌చౌదరి, చల్లాశ్రీనివాసులు పాల్గొన్నారు.

పండ్లతోటల పెంపకంతో ఆదాయం

తాడిమర్రి, ఫిబ్రవరి 14: రైతులు పండ్లతోటలపెంపకం చేపట్టి ఆదాయం పొందాలని సంకల్పతరు స్వచ్ఛందసంస్థ ప్రతినిధి అపూర్వబండారి సూచించారు. మండలంలోని మేడిమాకులపల్లి వద్ద బుధవారం రైతులకు పండ్లతోటల పెంపకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి మాట్లాడుతూ తాము ఉచితంగా పండ్లమొక్కలను పంపిణీ చేస్తున్నామన్నారు. రైతులు సద్వినియోగం చేసుకుని ఆదాయం పొందాలని తెలిపారు.

నల్ల బ్యాడ్జీలతో ఉద్యోగుల నిరసన



సీనియర్ అసిస్టెంట్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న ఉద్యోగులు

మడకశిరటౌన్, ఫిబ్రవరి 14: ప్రభుత్వ ఉద్యోగులు పెన్షనర్లు జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ కార్యాలయం ముందు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని విడనాడాలన్నారు. ప్రభుత్వ మొండి వైఖరి నశించాలని నినాదాలతో హోరెత్తించారు. ప్రభుత్వం వచ్చి ఐదు సంవత్సరాలు గడిచినా ఉద్యోగులు, పెన్షనర్లకు ఇవ్వాల్సిన డీఏ, పీఆర్‌సీతోపాటు ఇతర అలవెన్సులు చెల్లించలేదన్నారు. తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలంటూ ఉద్యమ కార్యాచరణలో భాగంగా తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. సీనియర్ అసిస్టెంట్ రామకృష్ణకు వినతిపత్రం అందజేశారు. జేఏసీ నాయకులు, ఉద్యోగులు, పెన్షనర్లు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించకపోతే ఉద్యమిస్తాం

హిందూపురం అర్బన్: ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక, పెన్షనర్లకు రాష్ట్ర ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోతే ఉద్యమిస్తామని హిందూపురం జేఏసీ నాయకులు హెచ్చరించారు. ఉద్యోగులు బుధవారం నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు. సాయంత్రం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బందికి వినతి ఇచ్చారు. రాష్ట్ర నాయకుల పిలుపు మేరకు నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరయ్యామన్నారు. అలాగే 17న ర్యాలీ నిర్వహిస్తామన్నారు.

20 నుంచి పారిశుధ్య కార్మికుల సమ్మె

పెనుకొండ, ఫిబ్రవరి 14: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గతంలో 16రోజులు పారిశుధ్య కార్మికులు సమ్మె చేపట్టారు. ఆ సమయంలో ప్రభు త్వం డిమాండ్లను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో సమ్మె విరమించారు. 35రోజులు గడుస్తున్నా ఇంతవరకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చలేదు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని లేనిపక్షంలో 20వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరిస్తూ కార్మికులు మునిసిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. బుధవారం సీఐటీయూ నాయకుడు బాబావలి, యూనియన్ నాయకులు చిన్నవెంకటేశ్, తిప్పన్న, చంద్ర, ముత్యాలు, లక్ష్మీదేవి తదితరులు కమిషనర్‌ను కలిశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలను 35రోజులు గడుస్తున్నా నెరవేర్చలేదన్నారు. సమ్మెకాలం జీతం ఇస్తామని హామీ ఇచ్చి ఇంతవరకు అమలు చేయలేదన్నారు. ప్రభుత్వం అంగీకరించిన డిమాండ్ జీఓ తక్షణమే విడుదల చేయాలని లేనిపక్షంలో 20వ తేదీ నుంచి ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

ఖురాన్ పఠనంలో విద్యార్థి ప్రతిభ



ప్రతిభా విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 14: ఖురాన్ పఠనంలో హిందూపురం రహ్మత్‌పురం ఇఖ్రా పాఠశాల విద్యార్థి అత్తార్ మొహమద్ జుల్ఫికర్ రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారని కరెస్పాండెంట్ మహమ్మద్ అకీబ్ తెలిపారు. 11వ తేదీన విజయవాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఖురాన్ పోటీలను యునైటెడ్ ఫోరం ఫర్ ఖురానిక్ స్టడీస్(యూఎఫ్‌క్యూఎస్) సంస్థ నిర్వహించింది. రాష్ట్ర వ్యాప్తంగా 9 వేల మంది విద్యార్థులు పాల్గొన్నారు. పోటీల్లో అత్తార్ మొహమ్మద్‌కు మొదటి స్థానం, షేక్ అస్పియా అంజూమ్ రెండవ స్థానంలో నిలిచిందన్నారు. ప్రతిభా విద్యార్థులను మంగళవారం హిందూపురం జామియా మసీదు ముతువల్లి నూరుల్లాఖాన్, ప్రభుత్వ ఖాజీ మౌలానా ముక్తియార్, పాఠశాల చైర్మన్ నజీరుద్దీన్, హెచ్‌ఎం షాకీరా అభినందించారు.

బాధితురాలికి బీకే సతీమణి పరామర్శ

రొద్దం, ఫిబ్రవరి 14: కోగిర గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు ఎల్‌ఐసీ అంజనేయులు మరదలు వరలక్ష్మమ్మ రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటుండగా మాజీ ఎమ్మెల్యే బీకే సతీమణి బీకే కమలమ్మ పరామర్శించారు. బుధవారం రొద్దం మండలంలోని కోగిర గ్రామానికి వెళ్లి ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి తిరిగిరాగా కమలమ్మ వెళ్లి ఆమెను పరామర్శించారు. త్వరగా కోలుకుని విధుల్లో చేరాలని ఆకాంక్షించారు. ఆమెవెంట టీడీపీ మహిళా కమిటీ నియోజకవర్గ ఉపాధ్యక్షురాలు లీలావతి, మాజీ వైస్ ఎంపీపీ సూర్యనారాయణ, సానిపల్లి మాజీ ఎంపీటీసీ సూరీ, చౌడేశ్, నగేష్, అంజినప్ప, చిన్న ఆంజనేయులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల శ్రమదానం

గోరంట్ల, ఫిబ్రవరి 14: మండలంలతోని కసిరెడ్డిపల్లిలో ఏఎన్‌కే డిగ్రీకళాశాలకు చెందిన ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు బుధవారం శ్రమదానం చేశారు. ఎన్ఎ స్ఎస్ ప్రత్యేక శిబిరంలో భాగంగా కసరెడ్డిపల్లి ఎస్సీకాలనీల్లోని అపరిశుభ్ర, పిచ్చి మొక్కలను తొలగించారు. అనంతరం పరిశుభ్రత వల్ల కలిగే ప్రయోజనాలను గ్రామస్థులకు వివరించారు. మొక్కలను విరివిగా నాటడంవల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేశారు. ఎస్ఎస్ఎస్ పీఓ జయప్రకాష్, అధ్యాపకులు నరసింహులు, బాబు పాల్గొన్నారు.

వైభవంగా చోళమాంబదేవి ఊరేగింపు

మడకశిరటౌన్, ఫిబ్రవరి 14: మండల కేంద్రంలో వెలిసిన చోళమాంబదేవి అమ్మవారి ఊరేగింపు బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. అమరాపురం పట్టణంలో డప్పు వాయిద్యాల మధ్య వేలాది మంది భక్తుల నడుమ అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పూలపల్లకిలో ఉంచి పట్టణంలోని పురవీధుల్లో ఊరేగించారు.

ఘనంగా వసంత పంచమి



శాంతినికేతన్ పాఠశాలలో సరస్వతిపూజ నిర్వహిస్తున్న విద్యార్థులు

పెనుకొండ, ఫిబ్రవరి 14: చదువుల తల్లి సరస్వతీదేవి పుట్టిన రోజును పురస్కరించుకుని బుధవారం పట్టణంలో వసంత పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక సరస్వతి విద్యామందిరంలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం చేపట్టారు. విద్యామందిరం హెచ్‌ఎం పద్మజ ఆధ్వర్యంలో అర్చకులు కార్తీక్ 69మంది చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామీణ బ్యాంక్ మేనేజర్ పవన్‌కుమార్, కమిటీ సభ్యుడు జయలక్ష్మమ్మ, చలపతిరావు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. అలాగే ప్రగతి గ్లోబల్‌జెన్ పాఠశాలలో హెచ్‌ఎం మంజువాణి, కరస్పాండెంట్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో సరస్వతిపూజ చేయించారు. డైరెక్టర్లు సాయిశ్రీధర్, సాయిసృజన, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. శాంతినికేతన్ పాఠశాలలో కరస్పాండెంట్ శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో గురుపంచమి వేడుకలు నిర్వహించారు. పదో తరగతి విద్యార్థుల చేత సరస్వతిపూజ చేయించారు.

మనుషుల్లో మార్పు రావాలి : రామ్మూర్తి స్వామీజీ

పావగడ, ఫిబ్రవరి 14: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన భారత రాజ్యాంగం పుస్తకాలకే పరిమితం కాకుండా మనుషుల్లో మార్పు వచ్చినప్పుడే దేశ ప్రగతికి దోహద పడుతుందని సర్వధర్మ శాంతి పీఠం అధ్యక్షుడు రామ్మూర్తి స్వామీజీ అన్నారు. ఇటీవల చిత్రదుర్గ జిల్లాలోని హొసదుర్గ గ్రామంలో నెలకొన్న కనకపీఠాధిపతి ఈశ్వరానంద స్వామీజీ ఆ గ్రామంలోని చెన్నకేశవ దేవాలయంలోకి ప్రవేశించి వచ్చారన్నారు. అనంతరం అగ్రవర్ణాల మఠాధిపతులు, అర్చకులు ఆలయాన్ని శుభ్రపరిచి హోమాలు చేయించి శూద్ర స్వామీజీ ప్రవేశించారన్న నెపంతో గోమూత్రం వెదజల్లడం దారుణమన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

గుడిబండ, ఫిబ్రవరి 14: మండలంలోని ఎస్.రాయాపురం గ్రామానికి చెందిన నాగేంద్రప్ప రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. బుధవారం అమరాపురం గ్రామంలో జరిగిన ఉత్సవాల్లో పాల్గొని స్వగ్రామానికి తిరిగి వస్తుండగా నాగేపల్లి గ్రామ సమీపంలో ప్రమాదానికి గురయ్యాడు. గాయపడ్డ అతనిని వెంటనే హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



రహిమాన్ కుటుంబ సభ్యులతో భువనేశ్వరి



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న బీకే పార్థసారథి, నాయకులు

అధైర్య పడకండి.. అండగా ఉంటా..

● రహిమాన్ కుటుంబ సభ్యులకు భువనేశ్వరి భరోసా

పెనుకొండ, ఫిబ్రవరి 14: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారాచంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును జీర్ణించుకోలేక గుండెపోటుతో మరణించిన పెనుకొండ పట్టణానికి చెందిన టీడీపీ అభిమాని ఆర్‌ఆర్ రహిమాన్ కుటుంబ సభ్యులను నారా భువనేశ్వరి బుధవారం రాత్రి పరామర్శించి వారికి పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. చంద్రబాబు అక్రమ అరెస్టును జీర్ణించుకోలేక గుండెపోటుతో మృతిచెందిన కార్యకర్తలను పరామర్శించేందుకు భువనేశ్వరి నిజం గెలవాలి పేరుతో చేపట్టిన యాత్రలో భాగంగా బుధవారం రాత్రి ఆమె పెనుకొండ చేరుకుంది. టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి, ధర్మవరం ఇన్‌చార్జి పరిటాల శ్రీరాములుతో కలిసి రహిమాన్ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఆప్యాయంగా పలకరించి కుటుంబ స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. మీరు అధైర్యపడకండి పార్టీ మీకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం రూ.3లక్షల చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆర్థిక సాయం అందించిన భువనేశ్వరికి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. నారా భువనేశ్వరి పెనుకొండకు వస్తున్నట్లు తెలుసుకున్న నియోజకవర్గానికి చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, తెలుగు మహిళలు ఆమెకు ఘనస్వాగతం పలకడానికి పెద్దఎత్తున తరలి వచ్చారు. మధ్యాహ్నం 4గంటల నుంచి ఆమె రాకకోసం వేచి ఉన్నారు. ఆమె పెనుకొండకు బయలుదేరినట్లు తెలియడంతో బీకే పార్థసారథి, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పార్టీ కార్యాలయం నుంచి రహిమాన్ ఇంటి వరకు ర్యాలీగా తరలివెళ్లారు. భువనేశ్వరికి పెద్దఎత్తున బ్యానర్లు, జెండాలు, ఫ్లెక్సీలతో ప్రజలు ఘనస్వాగతం పలికారు. ఆమెకు అడుగడుగునా మహిళలు పుష్పగుచ్ఛాలు అందిస్తూ పూలహారాలు వేస్తూ హారతులు ఇచ్చారు. ప్రజలకు భువనేశ్వరి అభినందనలు తెలిపారు. పరిశీలకుడు నరసింహారావు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవిత, మునిమడుగు వెంకటరాముడు, కేశవయ్య, మహిళ అధ్యక్షురాలు సుబ్బరత్నమ్మ, రొద్దం నరసింహులు పాల్గొన్నారు.



తరలివచ్చిన నారీలోకం

బడ్జెట్ సమావేశం రసాభాస

● ఎమ్మెల్యే ఏం చేశాడన్న వైసీపీ సభ్యులు
● ఐదేళ్ల అభివృద్ధిపై చర్చకు సిద్ధమా?: టీడీపీ
● ఇరుపార్టీల సభ్యుల మధ్య వాగ్వాదం
● రూ.59.40కోట్లతో బడ్జెట్ ఆమోదం



టీడీపీ, వైసీపీ సభ్యుల వాగ్వాదం

హిందూపురం, ఫిబ్రవరి 14: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన బడ్జెట్ సమావేశం రసాబాసగా మారింది. పురం అభివృద్ధిపై టీడీపీ, వైసీపీ సభ్యుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. హిందూపురం మునిసిపాలిటీ 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బుధవారం బడ్జెట్ సమావేశం నిర్వహించారు. చైర్‌పర్సన్ ఇంద్రజ అధ్యక్షతన సమావేశం జరగ్గా టీడీపీ వైసీపీ సభ్యుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అభివృద్ధి తామంటే తామే చేశామని చెప్పుకొచ్చారు. వైసీపీ సభ్యులు మాట్లాడుతూ ఈ ఐదేళ్లలో ఎమ్మెల్యే బాలకృష్ణ పట్టణానికి రూ.లక్ష నిధులు ఇవ్వలేదని అలాంటప్పుడు మీరు ప్రశ్నించకూడదన్నారు. ఈ సందర్భంగా రమేష్, రాఘవేంద్ర, సతీష్ మాట్లాడుతూ మా ఎమ్మెల్యేకి మీ ప్రభుత్వం నుంచి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఒక్కరూపాయయైన నిధులు ఇచ్చారా అంటూ నిలదీశారు. మీరు అధికారంలో ఉండి నిధులు ఇవ్వకపోతే దానికి బాధ్యులు ఎవరన్నారు. కరోనా కష్టకాలంలో కోట్ల రూపాయలు వెచ్చించి వైద్య పరికరాలు, మందులు అందజేశారని గుర్తుచేశారు. ఈ సందర్భంగా ఇరుపార్టీల సభ్యులకు వాగ్వాదం చోటుచేసుకుని గందరగోళం నెలకొంది.

రూ.59.40కోట్లతో బడ్జెట్ ఆమోదం: హిందూపురం మునిసిపాలిటీకి సంబంధించి 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను బడ్జెట్ చిన్నపాటి సవరణతో రూ.59.40కోట్లతో కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు అన్ని పద్దులతో కలిపి రూ.59,40,65,514 ప్రవేశ పెట్టారు. ఇందులో ప్రారంభ విలువ రూ.31,87,68,310 రెవెన్యూ జమలు రూ.41,98,36,500 మూలధన జమలు రూ.17,42,29,014గా చూపించారు. అంచనాలు వేయడం వరకు అధికారులు లెక్కలు చక్కగా చూపుతున్నారు. అందుకు తగ్గట్టు పన్నులు వసూలు చేయాలని టౌన్‌ప్లానింగ్, రెవెన్యూవారు వసూలు చేయాలని సభ్యులు డిమాండ్ చేశారు.

ప్రతి కౌన్సిల్‌లో గొల్లపల్లి నీళ్లపై రగడ: పదేళ్ల క్రితం వరకు హిందూపురంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉండేది. ఒకానొక దశలో నీరు ఇస్తే ఓటేస్తామని పట్టణ ప్రజలు ప్రశ్నించిన దాఖలాలున్నాయి. నిత్యం మునిసిపల్, తహసీల్దార్ కార్యాలయాల్లో అంబేడ్కర్ సర్కిల్‌లో ఖాళీ నీటి బిందెలతో నిరసనలు తెలిపేవారు. దీనిని గుర్తించిన ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి నీటిని తీసుకొచ్చేందుకు అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఒప్పించారు. అంతేకాక కేంద్రమంత్రి అయిన వెంకయ్యనాయుడుతో చర్చించి నీటిని తీసుకొచ్చారు. గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి పైప్‌లైన్ ద్వారా హిందూపురం పట్టణానికి నీరు వచ్చినప్పటి నుంచి నీటి సమస్య లేకుండా పోయింది. ఇలాంటి సందర్భంలో వైసీపీ కౌన్సిలర్లు ప్రతి సమావేశంలో గొల్లపల్లి నీటిని తీసుకురావడంతో మునిసిపాలిటీపై భారం పడిందని దీనికి బాధ్యత ఎమ్మెల్యే బాలకృష్ణదంటూ విమర్శించడం నిత్యకృత్యమైంది.

నయనానందకరం... ఉమానర్మదేశ్వరుల కల్యాణం

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 14: పట్టణంలోని త్యాగరాజనగర్‌లో ఉన్న ఉమానర్మదేశ్వరుల ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని పరస్కరించుకొని స్థితిలయ కారకులు ఉమానర్మదేశ్వరస్వామి కల్యాణోత్సవం బుధవారం నయనానందకరంగా సాగింది. వేద పండితుల మంత్రోచ్చారణలతో, మేలతాళాలు, మంగళ వాయిద్యాలతో ఆదిదేవతల కల్యాణాన్ని నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే ద్వాదశ జ్యోతిర్లింగ, 108 బాణ లింగాల ప్రతిష్ఠ, పార్వతీదేవి విగ్రహ ప్రతిష్ఠ, చండికేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలను చేపట్టగా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వహస్తాలత ద్వాదశ, బానలింగాలకు వివిధ అభిషేకాలు చేశారు. మూలవిరాట్‌ను పూలు, నగలతో సర్వాంగసుందరంగా ముస్తాబు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.



స్వహస్తాలతో స్వామివారిని అభిషేకిస్తున్న భక్తులు



ఉమానర్మదేశ్వరస్వామి మూలవిరాట్టు

వైసీపీ నాయకుడు మోసం చేశాడంటూ మహిళ ఆవేదన

● ఫిర్యాదు తీసుకోని పోలీసులు

హిందూపురం, ఫిబ్రవరి 14: హిందూపురం పట్టణ బీ-బ్లాక్ కన్వీనర్ నరేష్ అనే వ్యక్తి స్థలాలు ఇస్తానంటూ డబ్బులు తీసుకున్నాడు. వాటిని తిరిగి ఇవ్వమంటే ఇవ్వకుండా తను బెదిరిస్తున్నాడంటూ అదే పార్టీకి చెందిన పేట వెంకటరమణస్వామి డైరెక్టర్ భారతి ఆరోపించింది. బుధవారం పోలీస్ స్టేషన్ వద్ద విలేకరులతో మాట్లాడుతూ కొంతకాలం క్రితం స్థలాలు ఇస్తానని తనవద్దకు నరేష్ లక్షల్లో డబ్బులు తీసుకున్నాడన్నారు. కానీ అవి నకిలీవని తెలిసిందన్నారు. దీంతో డబ్బులు అడుగుతుంటే ఇవ్వలేదన్నారు. దీనిపై టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వెళ్తే సీఐ ఫిర్యాదు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాక అతను మోసం చేశాడని ఆత్మహత్య చేసుకుంటే కేసు నమోదు చేస్తానని సీఐ చెప్పడంతో మనస్థాపం చెంది రైల్వేట్రాక్ వద్దకు వెళ్లినట్లు తెలిపారు. అక్కడ స్థానికులు గుర్తించి స్టేషన్‌కు తీసుకొచ్చారన్నారు. తనకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై నరేష్‌ను వివరణ కోరగా కొంతకాలం క్రితం స్థలాలకు సంబంధించి కొంత మొత్తం ఇచ్చింది వాస్తవమే. కానీ స్థలాలు వద్దని డబ్బు కావాలని డిమాండ్ చేస్తోందని, ఆ స్థలాలు విక్రయించి డబ్బులు ఇస్తానని చెబితే వినకుండా రాద్ధాంతం చేస్తోందన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న భారతి

పురంలో ఉద్రిక్తత

● మున్సిపల్ అజెండాలో రోడ్డు పేరు మార్పు అంశం
● హిందూ సంఘాల ఐక్యవేదిక నిరసన
● కమిషనర్‌కు వినతి
● వెనుతిరిగి వెళ్తుండగా రాళ్లు రువ్విన దుండగులు
● వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న హిందూసంఘాల నాయకులు

హిందూపురం, ఫిబ్రవరి 14: పట్టణంలోని ఆర్పీజీటీ రోడ్డు పేరు మార్పు అంశాన్ని మున్సిపల్ ఆజెండాలో పొందుపరచడం బుధవారం ఉద్రిక్త పరిస్థితులకు దారితీసింది. గురువారం నిర్వహించే కౌన్సిల్ భేటీ అజెండాలో 39వ అంశంగా పేరు మార్పును చేర్చారు. అజెండా చూసిన హిందూసంఘాల ఐక్యవేదిక నాయకులు దీనిని వ్యతిరేకించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ పేరు మార్చకూడదంటూ మున్సిపల్ కమిషనర్ చాంబర్ వద్ద నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ.. ఆర్పీజీటీ రోడ్డుకు దశాబ్దాలుగా అదేపేరు ఉందనీ, ఇప్పుడు మార్చాలని చూడడం సరికాదన్నారు. వెంటనే ఆ అంశాన్ని తొలగించాలని డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. దీనిపై పరిశీలిస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు. కార్యాలయం నుంచి వెలుపలికి వస్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు ఎంజీఎం క్రీడామైదానం నుంచి రాళ్లు రువ్వారు. దీంతో ఐక్యవేదిక నాయకుడు ప్రకాశ్ తలపై రాయిపడి, రక్తగాయమైంది. మరొకరికి కూడా కాలికి పడటంతో వారు అక్కడే బైఠాయించి, నినాదాలు చేశారు. గుంపుపై రాళ్లు రువ్విన ఆకతాయిలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంలో పోలీసులు, హిందూసంఘాల నాయకుల మధ్య వాగ్వాదం సాగింది. ఆఖరుకు వారికి సర్దిచెప్పి, బయటకు పంపారు. వన్‌టౌన్ పోలీసు స్టేషన్ వద్దకెళ్లి బైఠాయించారు. నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. రాళ్లు రువ్విన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డీఎస్పీ కంజక్షన్, సీఐ శ్రీనివాసులుకు ఫిర్యాదు చేశారు. నిందితులను కఠినంగా శిక్షిస్తామని వారు హామీ ఇచ్చారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. గాయపడిన ప్రకాశ్‌ను ఆస్పత్రికి తరలించారు.



రాళ్లదాడిలో గాయపడిన ప్రకాశ్

నేడు పురానికి నారా భువనేశ్వరి

● బాధిత కుటుంబాలకు పరామర్శ

హిందూపురం, ఫిబ్రవరి 14: తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి గురువారం హిందూపురానికి రానున్నారు. నిజం గెలవాలి ఓదార్పు యాత్రలో భాగంగా శ్రీకంఠపురంలో మృతి చెందిన అంజినప్ప కుటుంబాన్ని పరామర్శించనున్నారు. చంద్రబాబునాయుడిపై అక్రమ కేసులు బనాయించి అరెస్టు చేయడాన్ని జీర్ణించుకోలేక గత ఏడాది సెప్టెంబర్ 22న టీడీపీ కార్యకర్త గుండెపోటుతో మృతి చెందాడు. భువనేశ్వరి ఆ కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందజేయనున్నారు. ఉదయం పాలసముద్రం గేట్‌వే బస్సుస్టేషన్ ప్రాంతం నుంచి 10 గంటలకు హిందూపురానికి చేరకోనున్నారు. శ్రీకంఠపురంలో అంజినప్ప కుటుంబాన్ని పరామర్శించిన అనంతరం మడకశిర నియోజకవర్గం చేరుకొని గుడిబండ మండలం దిన్నెహట్టి గ్రామంలోని ముత్తప్ప కుటుంబ సభ్యులను పరామర్శించనున్నారు. అక్కడే భోజనం చేసి నేరుగా పుట్టపర్తి విమనాశ్రయం చేరుకుంటారు. అక్కడ నుంచి గన్నవరం ఎయిర్‌పోర్టుకి వెళ్లనున్నారు. దీంతో భువనేశ్వరి నిజం గెలవాలి మూడు రోజుల పర్యటన ముగుస్తుందని టీడీపీ జిల్లా అధ్యక్షులు పార్థసారథి పేర్కొన్నారు.

పర్యటనను విజయవంతం చేయండి: నిజం గెలవాలిలో భాగంగా బాధిత కుటుంబాలను నారా భువనేశ్వరి పరామర్శకు రానున్న సందర్భంగా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీడీపీ నాయకులు కోరారు. యాత్రకు నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, రమేష్, అశ్వర్థనారాయణరెడ్డి పిలుపునిచ్చారు.

'నిజం గెలవాలి' విజయవంతం చేయండి



మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి

మడకశిరటౌన్, ఫిబ్రవరి 14: ఎన్టీఆర్ ట్రస్టు చైర్‌పర్సన్, చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరీ గురువారం గుడిబండ మండలం దిన్నేహట్టి గ్రామంలో పర్యటిస్తున్నారని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి కోరారు. బుధవారం పార్టీ కార్యాలయంలో పర్యటనపై నాయకులు, కార్యకర్తలతో చర్చించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ గురువారం ఉదయం 9 గంటలకు మడకశిర మండలం కల్లుమర్రి గ్రామానికి భువనేశ్వరీ చేరుకొంటారని, 9.30 గంటలకు మడకశిర పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్‌కు, 9.45 గంటలకు కదిరేపల్లి క్రాస్‌కు, 10 గంటలకు దిన్నేహట్టి గ్రామానికి ఆమె చేరుకొంటారని తెలిపారు. చంద్రబాబు అరెస్టయిన నేపథ్యంలో మృతి చెందిన ముత్తప్ప కుటుంబాన్ని పరామర్శిస్తారన్నారు. నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపు నిచ్చారు.ట

ఘనంగా అయ్యప్ప విగ్రహ ప్రతిష్ఠ

గుడిబండ, ఫిబ్రవరి 14: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం స్వామివారి విగ్రహ ప్రతిష్ఠను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ మంత్రి రఘువీరారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామస్థులు సుధాకర్, కరుణాకర్ పాల్గొన్నారు.



అలంకరణలో అయ్యప్పస్వామి ఆలయం



విగ్రహప్రతిష్ఠాపనలో పాల్గొన్న మాజీ మంత్రి రఘువీరారెడ్డి

వైభవంగా కన్యకాపరమేశ్వరి విగ్రహ ప్రతిష్ఠ



పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న గుండుమల తిప్పేస్వామి

గుడిబండ, ఫిబ్రవరి 14: మండలంలోని జమ్మలబండ గ్రామంలో కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారి విగ్రహప్రతిష్ఠను వైభవంగా నిర్వహించారు. బుధవారం అమ్మవారి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూలతో అలంకరించి వివిధ పూజా కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి హాజరై పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గుడిబండలో అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్నారు. ఆర్యవైశ్య సంఘం సభ్యులు టీడీపీ నాయకులు, అయ్యప్పస్వామి భక్తులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి అలంకరణలో శివుడు

మడకశిరటౌన్, ఫిబ్రవరి 14: మాఘ మాసం పురస్కరించుకొని ఐదవరోజు పట్టణంలోని చంద్రమౌళేశ్వరస్వామి ఆలయంలో శివుడు ఆంజనేయస్వామి అలంకరణలో కొలువుదీరారు. బుధవారం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. స్వామివారికి అర్చనలు, అభిషేకాలు, విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు.



రేపు రథసప్తమి వేడుకలు

పెనుకొండ, ఫిబ్రవరి 14: పట్టణంలోని ఘనగిరి లక్ష్మీప్రసన్న వెంకటరమణ స్వామి దేవాలయంలో శుక్రవారం రథసప్తమి వేడుకలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శ్రీనివాసులు, మంజువాణి దంపతులు ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఆలయ అర్చకులు రామకృష్ణాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ, తీర్థప్రసాదాలు అందిస్తామన్నారు. ఉదయం స్వామివారిని సూర్యప్రభ వాహనంపై పురవీధుల్లో ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొని స్వామికృపకు పాత్రులు కావాలన్నారు.

ఎంటీఎస్ ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించాలి

పెనుకొండ, ఫిబ్రవరి 14: శ్రీసత్యసాయిజిల్లాలో మినిమమ్ టైం స్కేల్‌లో పనిచేస్తున్న 1998-2008 ఎంటీఎస్ ఉపాధ్యాయులకు జనవరి నెల జీతం చెల్లించాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి, అధ్యక్షులు సుధాకర్, జయచంద్రారెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 320మంది ఉపాధ్యాయులు చాలీచాలని జీతాలతో పనిచేస్తున్నప్పటికీ సకాలంలో జీతాలు చెల్లించకపోవడం బాధాకరమన్నారు.